క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్హర్: మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు (సోమవారం) విద్యుత్ సరఫరకు అంతరాయం కలగనున్నట్లు కాటారం ఏడీఈ నాగరాజు, కొయ్యూరు సబ్ ఇంజనీర్ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 33కేవీ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్‌కాలనీలోని సాయిబబా దేవాలయం 10వ వార్షికోత్సవాన్ని రేపు(మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని భక్తులతో పాటు, జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతచేయాలని కోరారు. ఉదయం 7గంటలకు శ్రీ సాయినాథుడికి ప్రత్యేక అభిషేకం, 8గంటలకు ప్రత్యేక హోమం, మధ్యాహ్నం 12:30గంటలకు మహా అన్నదానం, సాయంత్రం విశేష పల్లకి సేవ ఊరేగింపు మహోత్సవం ఉంటుందన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



రేగొండ: కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన జయ్యారపు సందీప్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాగా, బాధితుడు రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ప్రవీణ్, పవన్ పాల్గొన్నారు.

అన్నదానం



కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం నుంచి నిత్యాన్నాదనం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సాకారంతో అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా శనివారం మొదటి రోజు పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాలాధారణ స్వాములకు అన్నదానం చేశారు. అంతకముందు ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గణపతిహోమంలో చేశారు. జనవరి 15 వరకు నిత్యాన్నదానం కొనసాగుతుందని దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు గుండూరి భానుప్రసాద్‌శర్మ, కృష్ణమోహన్‌శర్మ, ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, ఆలయ కమిటీ బచ్చు ప్రకాశ్, గురుస్వాములు జక్కు మొగిలి, ముస్కమల్ల సత్యం, పసుల రాంచంద్రం, గద్దె రవి, మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

రేగొండ: తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల యువజన కమిటీని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మారబోయిన ధనుంజయ తెలిపారు. అధ్యక్షుడిగా బొజ్జం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా సాదు నగేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు రవి, బోయిన తిరుపతి, జంగేటి సుధాకర్, పరిష రాజయ్య, జంగేటి రవి, బమ్మ తిరుపతి, దండెబోయిన సంతోష్, మొటం భద్రయ్య, బింగి శ్రీనివాస్, కుక్కల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రేగొండ: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మడికంటి మహేందర్ ఇటీవల గుండె పోటుతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ మధుసూదనచారి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపు భిక్షపతి, మాజీ సర్పంచ్‌లు లెంకల రాజిరెడ్డి, అన్నారపు రాజు, మాజీ ఎంపీటీసీ కేశిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నాయకులు గుర్రాల సుమన్‌రెడ్డి, బింగి భిక్షపతి, భాస్కర్ ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మొగుళ్లపల్లి: బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ కుమారస్వామి



మల్హర్: వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ

● ఎంఈఓ కొడెపాక రఘుపతి



చిట్యాల: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

చిట్యాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ కొడెపాక రఘుపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కాగా, ప్రథమ స్థానంలో ఏ. వైష్ణవి, ద్వితీయ స్థానంలో కె.కీర్తి, తృతీయ నవ్యశ్రీ, గెలుపొందగా బహుమతులు అందజేశారు. బుర్ర సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని కొయ్యూరు ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో మల్లారం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి వర్షిణి, ద్వితీయ స్థానంలో మల్లారం కస్తూరిబా పాఠశాల విద్యార్థి శ్రీనిధి, తాడిచర్ల జిల్లా పరిషత్ విద్యార్థి స్వాత్విక, రుద్రారం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి జస్వంత్ తృతీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి మనోహర్‌రావు, మహేష్, సంధ్య, ఎమ్మార్సీ సిబ్బంది సవేందర్, సంపత్, సీఆర్‌పీలు సమ్మయ్య, సమత, పుష్పలత పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లింగాల కుమారస్వామి అధ్యక్షతన పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ పోటీ పరీక్షలు భవిష్యత్‌లో మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను సోమవారం (నేడు) జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొనాలని సూచించారు. ప్రథమ స్థాయిలో పట్టెం దరణీదర్, ద్వితీయ స్థాయిలో బూర అశ్రుత, తృతీయ స్థాయిలో బోడ్డు సాయి కిరణ్‌ల గెలుపొందగా విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఉపాధ్యాయులు టి.వెంకన్న, డి.చెంచయ్య, శ్రావణి, ఎమ్మార్సీ సిబ్బంది చంద్రమౌళి, వేణు, సదయ్య, శివకుమార్, అనిల్ కుమార్, వసంత, రాజయ్య, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మండల స్థాయి వ్యాస రచన పోటీలను రేగొండ, కొత్తపల్లిగోరి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రెండు మండలాల నుంచి 50 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఐఎస్ కో ఆర్డినేటర్ తౌటి నరేష్, సిఆర్‌పి సహదేవ్, కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలను మోసంచేసిన ప్రభుత్వం’



కాళేశ్వరం: మాట్లాడుతున్న పుట్ట మధు



మల్హర్: చెక్కు అందజేస్తున్న పుట్ట మధు

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాళేశ్వరం: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో బాగంగా మహదేవపూర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. చేయూత పేరుతో రూ.4వేలు నెలవారి పింఛను ఇస్తామని ఇచ్చిన హామీ ఎటు పోయిందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలను, రైతులను, నిరుపేదలను మోసం చేసినట్లే వృద్ధులను దగా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంపలి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు శ్రీపతి బాపు, లక్ష్మారెడ్డి, నాయకులు అలీంఖాన్, గీత, స్వప్న, ప్రకాశ్, మనోహర్, రమేశ్, వెంకట్‌స్వామి, సల్మాన్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మల్హర్: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దుద్దిల్ల నిశాంత్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.2లక్షల బీమా చెక్కు మంజూరైంది. దీంతో ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంథనిలోని దుద్దిల్ల నిశాంత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నారయణ, పద్దురావు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి బెస్ట్ సర్వీస్ అవార్డు



బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న కృష్ణారెడ్డి

టేకుమట్ల: మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కసిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. 21 సంవత్సరాలుగా మండలంలో హెచ్‌ఐవీపై అవగాహన, ఏఆర్‌టీ మెడిసిన్ ప్రాముఖ్యత, కుష్ఠ వ్యాధి, మలేరియా, ఫైలేరియా నిర్మూలనపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నదుకు గానూ బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న శ్రీనాథ్

భూపాలపల్లి రూరల్: గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో మనవంట గది మన బాధ్యత కుకింగ్ అనే పోగ్రాన్ని దేవా గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోగ్రాంకు జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై గ్యాస్ ఏజెన్సీ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 23 వార్డు కౌన్సిలర్ మేకల రజిత, జిల్లా గ్యాస్ డీలర్లు కంకటి రాజవీరు, దేవా గ్యాస్ డీలర్ బాసాని శ్యామ్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

‘అప్పయ్య సేవలు మరువలేనివి’



అప్పయ్యను సన్మానిస్తున్న ఆదివాసీ సంఘాలు, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్

ములుగు: ములుగు డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించి హనుమకొండ జిల్లాకు బదిలీ అయిన అల్లెం అప్పయ్య సేవలు మరువలేనివని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివాసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, రాష్ట్ర కార్యదర్శి అన్నవరం రవికాంత్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి ముఖ్య అతిథులుగా హాజరై ఆయనను శాలువాతో సన్మానించి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి డీఎంహెచ్‌ఓగా సేవలు అందించారని గుర్తుచేశారు. మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్యం అందించడానికి తనవంతు కృషి చేశారని వివరించారు. వాగులు, వంకలు దాటుకుంటూ గిరిజనులకు మెరుగైన వైద్యం అందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ములుగు డివిజన్ అధ్యక్షుడు వజ్జ రాజు, జంపాల రవీందర్, అశోక్, నారాయణ, కొత్త సురేందర్, శ్రీధర్, శిరుప సతీష్, ఏళ్ల మధుసూదన్, జనగాం బాబూరావు, కొప్పుల రవి, జాఫర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట బుంగకు ఇసుక ఫిల్లింగ్ పనులు



మోటార్ల ద్వారా చేస్తున్న ఫిల్లింగ్ పనులు

ఏటూరునాగారం: మండల కేంద్రం నుంచి రామన్నగూడెం వరకు ఉన్న గోదావరి కరకట్టకు గతంలో కోతలు పడ్డాయి. అందులో భాగంగానే కరకట్ట కింద గోతులు పడడంతో గోదావరి నీరు గోతుల్లోకి వెళ్లి కోతలకు గురై మట్టి ఒర్లిపోకుండా నూతన సాంకేతికతో ఇసుక, నీరుతో ఉన్న మిశ్రామాన్ని కరెంటు మోటార్ల ద్వారా పైపులతో ఇసుక ఫిల్లింగ్ పనులను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 70 లక్షలు మెంటనెన్స్ కింద నిధులు మంజూరు చేయడంతో వాటితో పనులు చేపట్టారు. సుమారు 9 మీటర్ల మేర ఉన్నగోతులను పూడ్చివేస్తున్నారు. గోతులలో ఇసుక, నీటితో నింపడం వల్ల ఎలాంటి కోతలకు గురికాకుండా, కుంగిపోయే ప్రమాదం లేదని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ ఇసుక ఫిల్లింగ్ పనులు పూర్తి అయితన తర్వాత జియో షీట్స్ వేసి ఇసుకను అడ్డుగా నిర్మిస్తారు. అనంతరం జియో ట్యూబ్స్‌లను అమర్చి గోదావరి వరద కరకట్టకు తగలకుండా అడ్డుకునేందుకు నిర్మాణాలను చేపట్టనున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆత్మదాలిదానం చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు కిష్టయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అతని సర్వీస్ రివల్వర్‌తో కాల్చుకొని స్వరాష్ట్ర ఆకాంక్షను చాటిచెప్పిన అమరవీరుడు కిష్టయ్య అని అన్నారు. ఎస్సై లక్ష్మారెడ్డి, ఈర్ల వెంకన్న, శానబోయిన వెంకట్, సాదు రఘు, వెంకన్న, చిటమల రఘు, కంబాల రవి, చేరాలు, అశోక్, మొగిలి, కొండబోయిన రవి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు?

కాటారం: మండలంలోని శంకరాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడగజంగాల కాలనీలో జరిగిన చోరీని పోలీసులు చేధించినట్లు తెలిసింది. దుండుగులను గుర్తించిన పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 28న బుడగజంగాల కాలనీకి చెందిన అనుముల సత్తమ్మ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి 18 తులాల బంగారం, 50 తులాల వెండి, ఓ టీవీని అపహరించుకుపోయారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజీల ఆధారాలతో విచారణ చేశారు. బృందాలు విడిపోయి మూడు రోజులుగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఎట్టకేలకు మంచిర్యాల జిల్లాకు చెందిన దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చి పక్కా సమాచారంతో అక్కడికి వెళ్లినట్లు తెలిసింది. రెండు రోజుల పాటు మంచిర్యాల ప్రాంతంలో మకాం వేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎనిమిది మందితో కూడిన ముఠా ఈ చోరికి పాల్పడినట్లు తెలుస్తుంది. అదుపులోకి తీసుకున్న ఇద్దరి ద్వారా పోలీసులు చోరీకి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. మిగితా నిందితులు పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్నట్లు తెలిసింది. గతంలో మండలంలోని బస్వాపూర్ సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఓ కిరాణంలో జరిగిన చోరీలో కూడా ఈ ముఠాకు సంబంధం ఉండా ఇంకా ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడ్డారు అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

● మోటపోతుల రమేశ్‌గౌడ్



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

చిట్యాల: విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గురుకులాల బాట జిల్లా ఇన్‌చార్జ్ మోటపోతుల రమేశ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ, వెలుగు హాస్టళ్లను సందర్శించారు. అనంతరం అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టళ్లలో సరైనా వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. గురుకులాలో రెగ్యూలర్ సిబ్బందిని నియమించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాడి శ్రీకాంత్, కట్కూరి రాజేందర్ పాల్గొన్నారు.

మహాగర్జనకు మాదిగలు తరలిరావాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల కొమురయ్య



బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లో 2025 జనవరి 19న నిర్వహించే మాదిగల మహా గర్జనకు జిల్లా నుంచి వేలాదిమంది తరలిరవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల కొమురయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో మహగర్జనకు మద్దతుగా జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య జెండా ఊపి బైక్‌ర్యాలీ ప్రారంభించి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియామకాలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకే ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో డప్పు చెప్పు వృత్తిదారులకు రూ.4వేల పెన్షన్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్ మాదిగ, రవి, రాజేందర్, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని జెల్లా కాలనీ సమీపంలో ఆదివారం వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారస పడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. చల్పాక అడవుల్లో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ముమ్మరంగా తనిఖీ నిర్వహిస్తున్నారు.

వాజేడు: మండలంలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు జాతీయ రహదారిపై ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేసిన పోలీసులు అందులోని ప్రయాణికులను ప్రశ్నించడంతో పాటు అనుమానితుల వివరాలను సేకరించి వదిలేశారు.

దళితులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో దళితులకు ప్రాధాన్యం ఇవ్వాలని కేవీపీఎస్ నాయకుడు దేవేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. దళిత వాడల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, భరత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిన నాయకులు

హైదరాబాద్‌లో తల పెట్టిన మాల సింహగర్జన సభకు జిల్లాలోని పలు మండలాల నుంచి నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలకే ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను ఆపి కలిసి కట్టుగా ఉన్న ఎస్సీలను విడదీయొద్దని కోరారు. మాల కులస్తులు ఐక్యతతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి రూరల్: సింహగర్జనకు వెళ్తున్న నాయకులు



టేకుమట్లలో..



కాటారంలో..

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మల్లాపురం, కపపవానిగూంపు గ్రామాలలో చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ, సర్వీస్ టూ మాక్ కైడ్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, దస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ పాయం రమణ హాజరై మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి స్వచ్ఛంద సంస్థలు వచ్చి మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లోని ప్రజలకు సహాయ సహాకారాలు అందించడం శుభపరిణామం అన్నారు. చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాశ్, కుర్సం లవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410